క్లుప్తంగా

దరఖాస్తులు స్వీకరణ

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను సోమవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు ఆధార్‌కార్డు, దరఖాస్తు ఫారం, విద్యుత్ బిల్లులు, రేషన్‌కార్డులను జిరాక్స్ కాపీలను అందించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

‘పర్యాటకంతో చెంచులకు ఒరిగేదిలేదు’

మన్ననూర్: నల్లమలను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా చెంచులకు ఒరిగేదేమి లేదని మాజీ సర్పంచ్ మల్లికార్జున్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నల్లమల అటవీ లోతట్టు ప్రాంత చెంచు పెంటలలో నివసిస్తున్న చెంచులకు విద్య, వైద్యం అందించాలన్నారు. నల్లమల నుంచి చెంచులను దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లమలలోని చెంచు పెంటలకు కేంద్రంగా ఉన్న అప్పాపూర్‌లో గ్రామ పంచాయతీకి పక్కా భవనం, ప్రభుత్వ ఆస్పత్రి, వాటర్ ట్యాంకు నిర్మించాలన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు జంతుక దేవమ్మ, అరకంటి బోందయ్యలకు సోమవారం సత్యహరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ ఎన్. రాములు యాదవ్ వీల్‌చైర్లను అందించారు. కార్యక్రమంలో అంకిల్ల రామస్వామి, పరశురాములు, ప్రశాంత్, భాస్కర్, గ్రామస్తులు ఉన్నారు.

వనమహోత్సవానికి స్థల పరిశీలన



చారకొండ: మండల కేంద్రంలో వన మహోత్సవం భాగంగా మొక్కలు నాటేందుకు పంచాయతీ పరిధిలో ఉన్న స్థలాన్ని సోమవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి గణేష్ పరిశీలించారు. అనువుగా స్థలాన్ని గుర్తించారు. వనమహోత్సవానికి అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు సోమవారం రోటరీక్లబ్, హార్ట్‌ఫుల్‌నెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.4 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ఇతర పరికరాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో వీటిని అందజేసినట్లు అసోసియేషన్ సభ్యుడు వేణు పేర్కొన్నాడు. హెచ్ఎం బాలునాయక్, రోటరీ క్లబ్ సభ్యుడు గిరిబాబు, నర్సిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తాం

పెంట్లవెల్లి: ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తామని తహసీల్దార్ హిమబిందు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సర్వే నంబర్‌ను 137ను తొలగించాలని వినతి

వెల్దండ: మండలంలోని కొట్ర రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 137ను ధరణిలో నుంచి తొలగించాలని కోరుతూ కొట్ర గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 137లో 4.16గుంటల భూమిలో దాదాపుగా 20 ఏళ్ల కిందట గ్రామస్తులు ఇంటి నిర్మాణాలను నిర్మించుకున్నారని వివరించారు. రెవెన్యూ అధికారులు పూర్తి విచారణ చేసి సర్వేనంబర్ 137ను గ్రామకంఠం కింద నమోదు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కొట్ర గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల హర్షం

మన్ననూర్: ఆర్యవైశ్యుల కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా కాల్వ సుజాతను నియమించడంపై ఆర్యవైశ్య మహాసభ నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ, గ్రామ ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి రమేష్, సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

అచ్చంపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అచ్చంపేటలో రాజీవ్ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శేఖర్, బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు సైదులుయాదవ్, నానియాదవ్, మగ్బుల్, పాండురంగారెడ్డి, సంతుయాదవ్, యజాస్, శ్రీకాంత్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంతో పాటు తిమ్మాజిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, రైతులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. బంగారి పర్వతాలు, వెంకటస్వామి, తిరుపతయ్య, అమృతరెడ్డి, కత్తె ఈశ్వర్, మిద్దె రాములు, పాషా, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో వైఎస్సార్ చిత్రపటానికి టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజుతోపాటు కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. న్యాయవాది మధుసూదన్‌రావు, కౌన్సిలర్లు రహీం పాషా, నయూమ్, నాయకులు ఎక్బాల్, కేతూరి ధర్మతేజ, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

బల్మూర్: వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. వైఎస్‌ఆర్ 75వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొండనాగులలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. యాదగిరి, జహంగీర్, బీల్‌నాయక్, చందులాల్, పంతునాయక్, శంకర్‌గౌడ్, ఈశ్వరయ్య, అశోక్, ఆనంద్‌గౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండ: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, నాయకులు నర్సి రెడ్డి, సంతోష్, బంగారయ్య, రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్‌ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రశ్రీనుముదిరాజ్, నాయకులు కృష్ణముదిరాజ్, హమీద్, శ్రీనివాస్‌యాదవ్, రషీద్, తిరుపతిరెడ్డి, పోలే రాజు, తదితరులు ఉన్నారు.

తాడూరు: స్థానిక బస్టాండ్ కూడలిలో వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రోహిణి, మాజీ ఎంపీటీసీ రేణుక, నాయకులు పాల్గొన్నారు.

మన్ననూర్: శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం నివాసం వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా గ్రామస్తులకు చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రహీం, సత్యనారాయణ, శివాజీ, పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్‌ఆర్ 75వ జయంతి వేడుకలను నిర్వహించారు. వైఎస్‌ఆర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్య, శివ, తదితరులు ఉన్నారు.



బిజినేపల్లిలో..



కల్వకుర్తిలో..



కొల్లాపూర్‌లో..

మహిళా సంఘాల సభ్యుల రాస్తారోకో

అమ్రాబాద్: వాటర్ షెడ్ కమిటీల ఏర్పాటులో ఇతరుల ప్రమేయంతో ఏకపక్షంగా ఏర్పాటు చేస్తున్నారని బీజేపీ ఆధ్వర్యంలో కొంతమంది మహిళా సంఘాల సభ్యులు సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ మంత్రి సీతక్క అమ్రాబాద్ పర్యటన సందర్భంగా ఉప్పునుంతల(బీకే), తిర్మలాపూర్(బీకే), లక్ష్మాపూర్(బీకే), లక్ష్మాపూర్‌తండా(బీకే) గ్రామాలకు మహిళా సంఘాల జీవనోపాధి కోసం వాటర్‌షెడ్ ద్వారా మంజూరైన రూ.82.46 లక్షల చెక్కును అందజేశారన్నారు. అయితే ఆయా గ్రామాల్లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన కమిటీలు గ్రామాల్లో ఉన్న అధికారపక్షం నాయకులు ఏకపక్షంగా ఏర్పాటు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఐకేపీ అధికారులు గ్రామాలకు వెళ్లి అందరి సమక్షంలో కమిటీలు వేయాలని లేని యెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేవైఎం నాయకులు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శ్రీను, జైపాల్‌నాయక్, దేశ్య, తిర్మలాపూర్(బీకే) గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి, నారమమ్మ తదితరులు ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న మహిళలు

బాలలను పనిలో పెట్టుకోవడం అన్యాయం



వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నె గ్రామానికి చెందిన చెంచు బాలలను సొప్పరి బంగారయ్య, సొప్పరి కృష్ణయ్యలు పనిలో పెట్టుకోవడం సరికాదని వారిపై చర్యలు తీసుకోవాలని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి జక్కబాలయ్య, కులనిర్మూలన పోరాట సమితి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వారు గ్రామానికి వెళ్లి బాలల తల్లిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను పనికి పంపించకుంటే యజమానులు వేధిస్తున్నారని వివరించారు. భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెంచు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై నాన్‌బెయిలబుల్ కింద కేసే నమోదు చేయాలన్నారు. ఐటీడీఏపీఓ స్పందించి చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ అంబయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేష్, పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

లింగాల: వానా కాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు ఆశించే చీడపీడల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని సూరాపూర్ శివారులో సాగు చేసిన మొక్కజొన్న పంటను సోమవారం ఆయన పరిశీలించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించి తీవ్ర నష్టం కలిగిస్తుందని దీని నివారణకు బెంజోట్ అనే మందును ఎకరాకు 100 గ్రా తీసుకొని నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 6,200 ఎకరాలలో మొక్కజొన్నను సాగు చేశారని వివరించారు.

ఈజీఎస్ సామాజిక తనిఖీలపై గ్రామ సభలు



వెల్టూరులో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గ్రామసభ

ఉప్పునుంతల: మండలంలో జాతీయ ఉపాధిహామీ పనులపై 14 విడత సామాజిక తనిఖీలకు సంబంధించి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని ఫిరట్వానిపల్లి, ఈరట్వానిపల్లి, వెల్టూరు, తాడూరు, పెద్దాపూర్, కాంసానిపల్లి తండా, దాసర్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు ఆయా గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులపై మూడు రోజులపాటు డీఆర్‌పీలు నిర్వహించిన సామాజిక తనిఖీల వివరాలను గ్రామసభల్లో వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలతో వివరణలు తీసుకున్నారు. గ్రామసభల్లో తనిఖీల డీఆర్‌పీలు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

మన్ననూర్: కులం పేరుతో వేధింపులు, మానసిక క్షోభకు గురిచేసి అశ్వరావ్ పేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ, పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కుల నిర్మూలన పోరాట సమితి నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న పోలీసులే కుల వివక్షతకు గురికావడం దారుణమన్నారు. ఎస్‌ఐ మృతిపై పోలీస్ సంఘాలు స్పందించకపోవడం దురదృష్టకరం అన్నారు. పోలీసు అధికారులకే రక్షణ లేకుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సీఐతోపాటు నలుగురు పోలీసులను ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్వకుర్తిరూరల్: దళిత ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కుల వివక్ష వ్యతిరేకపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్జాల పరుశరాములు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి కానిస్టేబుల్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. అశోక్, కురుమయ్య, మిడ్జిల్ బాలయ్య, ప్రవీణ్‌కుమార్, బాల్‌రెడ్డి, చెన్నకేశవులు, కిరణ్‌కుమార్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కొల్లాపూర్ రూరల్: చెంచు ఈశ్వరమ్మపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మొలచింతలపల్లి చెంచు గూడెంలో ఆయన గిరిజన సంఘం నాయకులతో కలిసి ఈశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 10 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, చెంచులు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

లింగాల: ఈ నెల 7న అప్పాయపల్లిలో జరిగిన ఓ వివాదంలో రాంచందర్ అనే వ్యక్తిపై పర్వతాలు దాడి చేశాడు. సోమవారం నిందితుడిని అచ్చంపేట కోర్టులో జడ్జి ఎదుట హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించారని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి భజన బృందం సభ్యురాలు ఇటీవల సిద్దగోని అంజమ్మ మృతి చెందింది. సోమవారం నాటక బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. రమేష్‌గౌడు, వెంకటయ్య నరేష్, భజన బృందం సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆంగ్లం బోధనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సోమవారం ఘన వీడ్కోలు పలికారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతులు చేపట్టిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. హెచ్ఎం శ్రీనివాసులు, విద్యార్థులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కూన స్కైలాబ్ మాతృమూర్తి ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదే విధంగా పెద్దాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. వెల్దండలోని ఆకృతి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. వారి వెంట మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, విజయ్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రావు, నిరంజన్, ప్రసాద్, ఆనంద్, కార్యకర్తలు ఉన్నారు.

స్థలం పరిశీలన



కొల్లాపూర్: వరిదేల శమీవృక్షం వద్ద నూతనంగా చేపట్టనున్న మండపం నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై శమీవృక్ష కమిటీ సభ్యులతో చర్చించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్లు మేకల శిరీషయాదవ్, నయూమ్ నాయకులు ఎక్బాల్, కృష్ణమనాయుడు, కేతూరి ధర్మతేజ, సురేందర్‌సింగ్, ఎల్లాగౌడ్ తదితరులున్నారు.



చౌట చెరువుపై కుంగిన బస్సు

కొల్లాపూర్ నుంచి వనపర్తి జిల్లా పెబ్బేరుకు 26 మంది ప్రయాణికులతో బస్సు సోమవారం ఉదయం 10:00 గంటలకు బయలుదేరింది. మార్గమధ్యలో పెంట్లవెల్లి మండలం చౌట చెరువు మీదకు రాగానే 10:20 గంటల సమయంలో మట్టిలో బస్సు టైర్లు దిగి కుంగింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. 40 నిమిషాల తర్వాత సమీపంలో ఉన్న జేసీబీ సహాయంలో బస్సును బయటకు తీశారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

– పెంట్లవెల్లి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నాగర్‌కర్నూల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మెరలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యశీలారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం సత్యశీలారెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమాంలో డీఈఓ గోవిందరాజులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాయకులు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ..

పట్టణంలోని 9వ వార్డు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మడిగెల గోపాల్ కొన్నిరోజుల కిందట గుండెకు సంబంధించిన చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ కావలి శ్రీను తదితరులు ఉన్నారు.



కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

మెగా డీఎస్సీ ప్రకటించాలని వినతి

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ సోమవారం నిరుద్యోగులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. గురుకులాలలో ఖాళీగా ఉన్న 2 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, కృష్ణ, రాజునాయక్, పాండు, శ్రీవాని, మానస, మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నిరుద్యోగ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం విద్యా అధికారి నరేందర్‌కు వినతి పత్రం ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శి మధుగౌడ్, ప్రేమ్‌కుమార్‌లు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు బి దాస్ అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు.

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

రుణమాఫీ వెంటనే అమలు చేయాలని కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాముయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ నాయకులు యాదగిరిరావు, సోషల్‌మీడియా కన్వీనర్ బొట్టు శ్రీను, నాయకులు తీగల శేఖర్, సైదులు, పరశురాములు, కృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు..

కొల్లాపూర్: నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించొద్దని తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గం బాలపీరు అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన తహసీల్దార్ శ్రీకాంత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాముడు, వెంకటస్వామి, బాలయ్య, లింగమ్మ, సలీం, రాజు తదితరులున్నారు.

పారదర్శకంగా నిధులు వినియోగించాలి

కోడేరు: అమ్మ ఆదర్శ పాఠశాల మౌలిక వసతుల కల్పనకు మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించాలని పై జిల్లా సెక్టోరియల్ అధికారి మురళీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పక్కదారి పడకుండా వాడుకోవాలన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి మురళీధర్‌రెడ్డి

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఐసీడీఎస్ కార్యకర్తలకు శాపంగా మారిన జీఓ నంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ టీచర్‌లకు, ఆయాలకు రూ.2 లక్షల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సమ్మె ఒప్పందాలను అమలు చేయాలన్నారు. ఆంజనేయులు, పాదిలరామయ్య, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ నాయకులు, మాసమ్మ, సువర్చల, రాధమ్మ, సీతమ్మ, సరోజ, అండాలమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఏకమవుదాం

అచ్చంపేట రూరల్: ఆరెకటికల హక్కుల సాధనకు అందరు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆలిండియా కటిక ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డబ్బికార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని రాష్ట్రాల కటిక కులస్తులను ఏకం చేస్తామన్నారు. సమాజంలో తగిన గౌరవం, హక్కులు దక్కేంతవరకు సంఘం తరుపున పోరాడుతామన్నారు. మండికారి బాలాజీ, అచ్చంపేట ఆరె కటిక సంఘం అధ్యక్షుడు లింగకారి బాలాజి, లక్ష్మణ్, ఖాజాజీ, శివాజీ, జాహంగీర్, లక్ష్మి, రాజేశ్వరి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాఠశాలకు ఉపాధ్యాయుల డుమ్మా



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న యువతి

అమ్రాబాద్: మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో మొత్తం 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం నుంచి పాఠశాలకు ఉపాధ్యాయులు హాజరకావడం లేదు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఓ యువతితో పాఠశాలలో విద్యార్థులను కూర్చోబెట్టి చదివించాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.